క్లుప్తంగా

వరి పొలాల పరిశీలన



మురారిలో వరి నారును పరిశీలిస్తున్న ఏఓ సద్గురుమూర్తి

గండేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వరి పొలాలను గురువారం మండల వ్యవసాయాధికారి ఎ.సద్గురుమూర్తి గురువారం పరిశీలించారు. పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ నెల 20వ తేదీ లోపు వరినాట్లు 100 శాతం పూర్తి చేసుకోవాలని సూచించారు. వరినారు సుతలు తుంచి నాటడం ద్వారా కాండం తొలుచు పురుగు చేసే నష్టాన్ని నివారించవచ్చన్నారు. పంట వేసిన 25 నుంచి 30 రోజుల లోపు కార్బాఫ్ హైడ్రాకోరైడ్, గుళికలు ఎకరాకు 8 కేజీల చొప్పున చల్లుకోవాలని సూచించారు. అర్హత గల కౌలు రైతులకు కౌలుకార్డులు మంజూరు చేస్తామన్నారు. ఆయన వెంట ఉద్యాన సహాయకులు ఎస్ దుర్గా ప్రసాద్, తదితరులు ఉన్నారు.

గిరిజనుల అభివృద్ధే లక్ష్యం



తునిలో గిరిజన సేవా వాహనాన్ని ప్రారంభిస్తున్న రెడ్డి సేవా సంఘం ప్రతినిధులు

తుని: గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తుని-పాయకరావుపేట రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. స్వామి వివేకానంద ఫాలోవర్ శర్మ మాస్టార్ ఆధ్వర్యంలో 'గిరిజన సేవ' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అనకాపల్లి జిల్లా కొయ్యూరి మండలంలోని గిరిజన గ్రామాల్లో గిరిజనులు దుస్తులు, స్కూల్ పిల్లలకు కొత్త దుస్తులు, ఆటవస్తువులు, చెప్పులు పంపిణీ చేయనున్నారు. ఈ వస్తువులు తరలించే వాహనాన్ని సంఘ ప్రతినిధులు గురువారం ప్రారంభించారు. సంఘ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, గిరిజన సేవాప్రాజెక్టు చైర్మన్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: పట్టణంలో గురువారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాల (కోనేటి బడి) హెచ్‌ఎం సుమలత ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 వరలక్ష్మి మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన పిల్లలందరూ పాఠశాలల్లో చేరాలన్నారు. బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ, రజా, రాము, రామలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

వేగవంతంగా స్టేడియం నిర్మాణం



స్టేడియాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు, సూరిబాబు రాజు

పెద్దాపురం: స్థానిక శతాబ్ది పార్కు సమీపంలో నిర్మితమవుతున్న ఇండోర్ షటిల్ కోర్టు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజుతో కలిసి స్టేడియంను ఆయన పరిశీలించారు. నిర్మాణం సగంలో నిలిపివేయడంతో భవనాన్ని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.

ప్రాణహిత మొక్కలు నాటండి

కాకినాడ సిటీ: పట్టణంలో పర్యావరణానికి హాని కలిగించే కోనకార్పస్ చెట్లను తొలగించి వాటి స్థానంలో ప్రాణ వాయువు విడుదల చేసే మొక్కలు నాటేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆ చెట్ల తొలగింపు, ఫ్లెక్సీలు లేని స్ట్రీట్ వంటి అంశాలపై కలెక్టర్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్, హార్టీకల్చర్, అటవీశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పట్టణ పరిధిలో కోనకార్పస్ చెట్ల తొలగింపు, వాటి స్థానంలో ఆక్సిజన్ విడుదల చేసే మొక్కలు నాటడం, ఫ్లెక్సీలు లేని స్ట్రీట్‌లను తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో చర్చించారు. పట్టణ పరిధిలో సుమారు 4,602 కోనకార్పస్ చెట్లు గుర్తించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తొలిదశలో పట్టణ పార్కుల్లో ఉన్న చెట్లు తొలగించాలని ఆదేశించారు. జిల్లా అటవీశాఖ అధికారులను సమన్వయం చేసుకుని తొలగించిన చెట్ల స్థానంలో వెంటనే ఆక్సిజన్ విడుదల చేసే మొక్కలు నాటేందుకు ప్రణాళిక ప్రకారం పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

వెదజల్లు సాగు.. లాభాలు బాగు

- ఆసక్తి చూపుతున్న రైతులు
- ఖరీఫ్ పనుల్లో బిజీబిజీ
- 25 వేల ఎకరాల్లో సాగు



లంపకలోవలో రైతులకు సస్యరక్షణ చర్యలు వివరిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రత్తిపాడు: రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో ప్రత్తిపాడు నియోజకవర్గంలో కొద్దిరోజులుగా వర్షాలు పడటంతో రైతులు ఖరీఫ్ వరిసాగుకు సిద్ధమయ్యారు. ఏలేశ్వరం, పత్తిపాడు, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా మారారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వెదజల్లు విధానంలో సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వెదజల్లే పద్ధతిలో సాగు చేయడం వల్ల అధిక లాభాలు అర్జించడంతో పాటు పెట్టుబడులు తగ్గించవచ్చన్న విషయాన్ని గ్రహించిన రైతాంగం ఆ దిశగా అడుగులు వేస్తున్నారు.

వర్షాభావంతో...

వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు సాగుకు ఇబ్బంది పడుతున్నారు. తొలకరి ప్రారంభమై నెల దాటినా ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో భూమిలో తేమశాతం తగ్గింది. ఫలితంగా వర్షం కురిస్తే గానీ దమ్ములు చేసేందుకు వీలులేని పరిస్థితి. దీంతో రైతులు తక్కువ నీటి వనరులతో సాగయ్యే వెదజల్లు విధానంపై మొగ్గు చూపుతున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 25,035 ఎకరాలకు కాగా కనీసం 1,250 ఎకరాల మేర నారుమడులు వేయాల్సి ఉంది. ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో రైతులు చెరువులు, కాలువల కింద కేవలం 45 ఎకరాల మేర మాత్రమే నారుమడులు వేశారు.

వర్షపాతం ఇలా...

నియోజకవర్గంలో ఈ సీజన్‌లో అత్యధిక వర్షపాతం జూన్ 22న 3.6 సెంటీ మీటర్లు నమోదైంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభించాలంటే వర్షపాతం 83 మిల్లీ మీటర్లు ఉండాలి. కానీ జూన్ నెల నుంచి ఇప్పటివరకూ 65.6 మిల్లీ మీటర్ల మేర వర్షపాతం నమోదైందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వర్షాలు పడకపోవడంతో పూర్తి స్థాయిలో నారుమడులు రైతాంగం సిద్ధం చేసుకోలేకపోయిందని అధికారులు చెబుతున్నారు. కూలీల సమస్య ఆలస్యంగానైనా వర్షాలు కురిసిన తర్వాత వరి సాగు చేద్దామన్నా రైతులకు కూలీలు సమస్యగా మారారు. ప్రస్తుతం కూలీలకు మంచి డిమాండ్ ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

మండలం	సాధారణ సాగు విస్తీర్ణం (ఎకరాలలో)	ప్రస్తుతం పడిన నాట్లు (ఎకరాలలో)
ఏలేశ్వరం	6,220	6
ప్రత్తిపాడు	10,500	14
రౌతులపూడి	5,100	25
శంఖవరం	3,215	0
మొత్తం	25,035	45

కూలీల కొరతకు చెక్

సమయాభావం, కూలీల కొరత, పెరిగిన కూలి రేట్లు తదితర కారణాలతో సంప్రదాయ నాట్లు వేసే పద్ధతిని రైతులు వీడుతున్నారు. గతంలో భారీ వర్షాలు వరదలు కారణంగా పంట సాగులో ఇబ్బందులు తలెత్తగా ప్రస్తుతం రైతులు ఖరీఫ్ సాగుకు విత్తనాలను వెదజల్లడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వీలైనంత త్వరగా నాట్లు పూర్తి చేయాలని వ్యవసాయాధికారులు సూచించిన నేపథ్యంలో రైతులు నారు మళ్లు వేసి నాట్లు వేయడం ఆలస్యమవుతుందని భావిస్తున్నారు. దీంతో నేలను దమ్ముచేసి విత్తనాలను చల్లడానికి సిద్ధపడుతున్నారు. విత్తనం మొలకెత్తకపోతే తరువాత తీసుకొనే చర్యలపై రైతాంగం కసరత్తు చేస్తోంది.

ఖర్చులు తగ్గుతాయి



వెదజల్లు విధానంలో ముందుగా నారుమళ్లు వేయాల్సిన పనిలేదు. దీంతో నారుమడి తయారీకి అయ్యే ఖర్చుతో పాటు కూలీలు, దుక్కికి అయ్యే ఖర్చులు మిగులుతాయి. అలాగే ఆకుతీత, నాట్లకు అయ్యే ఖర్చులు సైతం తగ్గుతాయి. సమయాభావం నివారించవచ్చు. నీరు ఎపుడు అందుబాటులో ఉంటే అప్పుడు వెదజల్లే పద్ధతిలో సాగు చేయవచ్చు. వెదజల్లు పద్ధతి ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతు భరోసా కేంద్రాల్లో ఆర్‌జీఎల్, ఎంటీయూ 1064 రకం వరి వంగడాలు (విత్తనాలు) సిద్ధంగా ఉన్నాయి. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు.

– యింటి వీర గంగాధర్, వ్యవసాయాధికారి, ప్రత్తిపాడు

ఘనంగా ఇండియన్ క్రిస్టియన్ డే



సమావేశంలో మాట్లాడుతున్న జుహానీ హాలోనెన్

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం ఈహెచ్‌హెచ్ క్యాంపస్‌లో గురువారం ఇండియన్ క్రిస్టియన్ డేను ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్, ఫెయిత్ ఇవాంజలికల్ మినిస్ట్రీస్ అధినేత జుహానీ హాలోనెన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పలు జిల్లాలకు చెందిన పాస్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిష్యుడు తోమా మొదటిగా క్రీస్తు శకం 72లోనే భారతదేశంలో అడుగుపెట్టారన్నారు. ఇది తెలియక బ్రిటిష వారితోనే క్రైస్తవ మతం దేశంలోకి వచ్చిందని, అన్యమతమని తప్పుగా ప్రచారం చేస్తూ క్రైస్తవుల మనోభావాలు దెబ్బతీసేలా కొందరు ప్రవర్తిస్తున్నారన్నారు. క్రైస్తవం మంచి మార్గమని, మతం కాదన్నారు. అనంతరం వృద్ధులకు జుహానీ హాలోనెన్, సుహాసినీ హాలోనెన్ దంపతులు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈహెచ్‌హెచ్ నాయకులు ప్రశాంత్‌కుమార్ హాలోనెన్, బత్తిన రాజు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా జయంతి వేడుకలు



ఏలేశ్వరంలో వంగవీటి రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాపు నేతలు



గోకవరంలో వంగవీటి రంగా, ఎస్వీ రంగారావు విగ్రహాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలేశ్వరం: కాపు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు పట్టణంలో గురువారం ఘనంగా జరిగాయి. రంగాయూత్ ఆధ్వర్యంలో స్థానిక వైఆర్‌పీ కార్యాలయం వద్ద వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల కోసం వంగవీటి రంగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాపు నాయకులు గట్టెం వెంకటరమణ, రెడ్డి లోవరాజు, తిక్కిశెట్టి స్వామికమల్, రాజపోతు శ్రీను, అడపా శేషగిరిరావు, సఖిరెడ్డి వంశీ, బాదం ఆనంద్‌కుమార్, గూడపాటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటలో గురువారం దివంగత నేత వంగవీటి మోహన్ రంగా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగా ఫ్లెక్సీలతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు.

గోకవరం మండలంలో...

గోకవరం: గ్రామంలో వంగవీటి మోహన్‌రంగా జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వ్యవసాయశాఖ సమీపంలో ఉన్న వంగవీటి మోహన్‌రంగా, ఎస్వీ రంగారావు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదల అభ్యున్నతికి రంగా చేసిన సేవలను కొనియాడారు. ప్రతిఒక్కరూ రంగా ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో దాసరి తమ్మన్నదొర, గాజింగం సత్తిబాబు, దాసరి సతీష్‌బాబు, కంబాల శ్రీనివాస్‌రావు, దాసరి చినబాబు, ఆచంట రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాచపల్లిలో...

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో గురువారం వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సచివాలయ సెంటర్‌లోని రంగా విగ్రహానికి రాచపల్లి కాపు సంఘం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేశెట్టి అనిల్, మర్రి చంద్రరావు, గొర్ర రాంబాబు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన రామలింగేశ్వరస్వామికి గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జ్యేష్ఠ బహుళ త్రయోదశి, తత్కాల చతుర్దశి మాస శివరాత్రి సందర్భంగా ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు, స్మార్త ఆగమ పండితులు అల్లంరాజు రామకృష్ణ శర్మ, ఫణి శర్మ, చెరుకూరి కారుణ్య శర్మ, కార్తీక్ శర్మ స్వామివారికి మహాగణపతి పూజ, మహన్యాస పారాయణ, 11 రుద్రాలు, 21 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు.

కోలాట బృందానికి విరాళం



వేములపాలెంలో కోలాట బృందానికి నగదు సాయం అందజేస్తున్న గంగరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వేమలపాలెం గ్రామానికి చెందిన చింతాలమ్మతల్లి కోలాట బృందానికి గురువారం సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ప్రత్తిపాడు నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ ఒమ్మి గంగరావు రూ.5,016 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోలాటం మరింత అభివృద్ధి చెందాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కళాకారులు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వి.వరహాలు, ఎం.శివ, ఎం.నాని, డి.తాతబాబు, ఎం.రాజారావు, వి.శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కళాశాలలో బీఏ ఆనర్స్ (ఎకనామిక్స్), బీకాం ఆనర్స్ (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ ఆనర్స్ (కెమిస్ట్రీ), బీఎస్సీ ఆనర్స్ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ ఆనర్స్ (జువాలజీ) కోర్సులు అందుబాటులో ఉన్నట్లు ఆమె వివరించారు. ఈ నెల 10వ తేదీతో అడ్మిషన్ల ప్రక్రియ ముగుస్తున్నందున విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

విద్యాసంస్థలు మూసివేత

ఏలేశ్వరం: విద్యార్థి సంఘాల దేశవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం మండలంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ ప్రవేశ పరీక్షను నిర్వహించడంలో విఫలమైనందుకు నిరసనగా ఈ బంద్ చేపట్టారు. మండలంలోని ప్రైవేట్ విద్యాసంస్థలు మూతపడ్డాయి. ప్రభుత్వ విద్యాసంస్థలు యథావిధిగా పనిచేశాయి. పట్టణంలోని శ్రీవిద్యా, శ్రీచైతన్య, భాష్యం తదితర ప్రైవేటు స్కూళ్లను మూసి వేశారు.

విద్యాసంస్థలు బంద్

జగ్గంపేట: విద్యార్థి సంఘాల పిలుపు మేరకు గురువారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ మండలంలో విజయవంతమైంది. జగ్గంపేటలోని ప్రైవేట్, ప్రభుత్వ విద్యా సంస్థలను విద్యార్థి సంఘాల నాయకులు మూసి వేయించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి కె.సతీష్, ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా సహాయ కార్యదర్శి మణికంఠ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయ స్థాయిలో పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. వివిధ పరీక్షల నిర్వహణలో జరుగుతున్న లోపాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జగ్గంపేట మండల అధ్యక్షులు అరుణ్, సతీష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

స్వామి వివేకానందకు ఘన నివాళులు



ఏలేశ్వరంలో వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: పట్టణంలో గురువారం స్వామి వివేకానంద వర్ధంతి నిర్వహించారు. స్థానిక కోనేటిబడి సమీపంలోని విగ్రహదాత తూమురౌతు గురయ్య ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్వామి వివేకానంద అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన సర్వమత ప్రార్థన సమావేశంలో భారతదేశం ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత అల్లూరి

- ఘనంగా సీతారామరాజు జయంతి వేడుకలు
- విప్లవవీరుడికి ఘన నివాళులు



ఏలేశ్వరంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు



గోకవరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



శంఖవరంలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఏలేశ్వరం: విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా జరిగాయి. ఏలేశ్వరం పట్టణంలో అల్లూరి విగ్రహానికి సీఐటీయూ నాయకులు పాకలపాటి సోమరాజు, పిల్లా రాంబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శమన్నారు. దేశం కోసం అల్లూరి ప్రాణాలను సైతం లెక్కచేయలేదన్నారు. అల్లూరి ఆశయ సాధనకు యువత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు రౌతు సత్యనారాయణ, గుండుబిల్లిచక్రం, వేమగిరి దొంగబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ కె.శివప్రసాద్ ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని లింగంపర్తిలో సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అల్లూరి సేవలు మరువలేనివి

శంఖవరం: స్వాతంత్ర పోరాటంలో అల్లూరి సీతారామరాజు చేసిన సేవలు మరువలేనివని పలువక్తలు కొనియాడారు. గ్రామంలో అల్లూరి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహనికి స్థానిక నేత మేకల కృష్ణ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

కిర్లంపూడి: దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం బూరుగుపూడిలో అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన సేవలను కొనియాడారు. ఏపీ ఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, కుంచె అంజిబాబు, నారాయణమూర్తి, వి.సత్తిబాబు, దానం గంగ, మీరియాల సత్యనారాయనణ, కర్నాకుల సూరిబాబు మానీడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు మండలంలో...

కోటనందూరు: మండలంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శమన్నారు. స్థానిక నూకాలమ్మ గుడి ప్రాంతంలో ఉన్న అల్లూరి విగ్రహం వద్ద వెలగా వెంకటకృష్ణారావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: రవి హస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ప్రత్తిపాడులో గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద గల అల్లూరి విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ నాయకులు రాపర్తి రామలింగేశ్వరరావు, ఎస్.సూర్యనారాయణ, సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: మండల వ్యాప్తంగా గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన సేవలను కొనియాడారు.

మాజీ సీఎం రోశయ్య జయంతి

స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సేవాసంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు పాల్గొన్నారు. రాష్ట్రంలో హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని హోంగార్డుల సంఘం నేతలు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు వినతిపత్రం సమర్పించారు.

గోకవరం మండలంలో...

గోకవరం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గోకవరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన రహదారి చెంత విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఉన్న అల్లూరి విగ్రహానికి స్థానిక నాయకులు వరసాల ప్రసాద్, ముత్యం నాని, ఉంగరాల ఆదివిష్ణు, ప్రసాద్‌రాజేష్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం, స్వాతంత్ర్య సంగ్రామం కోసం కేవలం 33 ఏళ్ల వయస్సులోనే ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శనీయుడు

జగ్గంపేట: యువతకు స్ఫూర్తిప్రదాత విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు అని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి రఘురాం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వసంతకుమార్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జగ్గంపేటలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



బూరుగుపూడిలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రైతు కూలీ సంఘం నేతలు



ప్రత్తిపాడులో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ, యూటీఎఫ్ నాయకులు



కోటనందూరు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి రఘురాం